# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



- మళ్లీ పాత రోజులే వస్తయ్ ● ఉచిత కరెంట్ ఖతమైతది
- కాళేశ్వర జలాలు రాకుండా పోతయ్
- ఎన్కటి లెక్కనే భూములు బీళ్లయితయ్
- ధరణి పోయి పాత వ్యవస్థ వస్తది ● భూములకు భద్రత కరువైతది
- కౌలుదారు కాలంతో భూమి దొరుకుడు కష్టమైతది
- ధరలు పడిపోతయ్ ● రైతు కుటుంబాలు ఆగమైతయ్
- ● ఆందోళనలో కర్షకలోకం ● రైతులను ఆగం చేయద్దని హెచ్చరిక ● హస్తం పార్టీ తీరుపై ఆగ్రహం

## కాంగ్రెస్‌కు ఓటేస్తే ఎవుసం ఆగమే

జగిత్యాల, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిజానికి యాభై ఎనిమిదేండ్ల సమైక్య రాష్ట్రంలో తెలంగాణ దగా పడ్డది. అందులోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వ్యవసాయరంగం పూర్తిగా ఆగమైంది. పూడికతో నిండిన చెరువులు, కుంటలు, నెర్రెలు బారిన నేలలు, సముద్రంపాలైన గోదావరి జలాలు.. సాగునీటి వసతి లేక బీడుగా భూములు.. నీళ్లు, కరెంట్ లేక కండ్ల ముందే ఎండిన పంటలు.. చివరకు అప్పులు, ఆత్మహత్యలు, వలసలు.. అయినా పట్టని ప్రభుత్వాలు.. ఇలా కండ్ల ముందే కదలాడుతున్న నాటి రోజులను మరిచిపోలేకపోతున్నది. ఉద్యమ సమయంలో ఈ పరిస్థితులను కండ్లారా చూసిన కేసీఆర్, పదేళ్ల కాలంలోనే రైతులను గట్టెక్కించారు. అన్ని విధాలా అండగా నిలిచి సాగును పండుగలా చేశారు. ప్రాజెక్టులు నిర్మించి ప్రతి ఎకరాకూ గోదావరి జలాలను తెచ్చారు. మిషన్ కాకతీయ కింద చెరువులు పునరుద్ధరించారు. రైతుబంధు ఇచ్చి పెట్టుబడికి సహాయంగా నిలిచారు. ఇప్పటి వరకు పదకొండు విడుతలుగా 9.25,343 మంది రైతులకు ₹7,750.68 కోట్లను జమ చేశారు. అలాగే, వ్యవసాయ విస్తరణ అధికారుల సేవలను మరింత అందుబాటులోకి తెచ్చారు. 2014లో 69 మంది ఉంటే.. తర్వాత కొత్తగా 189 నియమించారు. ప్రస్తుతం 258 పని చేస్తున్నారు. ఇంకా పంట రుణాలు మాఫీ చేయించి అప్పుల భారం లేకుండా చేశారు. రైతు బీమాతో కుటుంబాలకు భరోసానిచ్చారు. ప్రధానంగా సాగునీరు, 24 గంటల కరెంట్ ఇచ్చి దశాబ్దాల గోసను తీర్చారు.

### పది లక్షల ఎకరాల్లో సాగు

రైతుబిడ్డ కేసీఆర్ కృషితో ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రంగం బలోపేతమైంది. 2014కు ఇప్పటికి తేడా చూస్తే.. ఆనాడు ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన రైతుల సంఖ్య 3,57,725 మంది ఉంటే.. ప్రస్తుతం 9,25,343కు చేరింది. ఈ పదేళ్లలో కొత్తగా 5,67,618 మంది సాగుబాట పట్టడం కనిపించింది. అలాగే, అప్పుడు అన్ని పంటల సాగు విస్తీర్ణం 11,79,013 ఎకరాలు ఉంటే, ప్రస్తుతం 22,41,066 ఎకరాలకు చేరింది. అంటే 10,62,053 ఎకరాల్లో సాగు పెరిగింది. వరి సాగు 3,63,776 ఎకరాల్లో మాత్రమే ఉంటే.. ప్రస్తుతం 12,35,223 ఎకరాలకు చేరింది. అంటే 8,71,447 ఎకరాల్లో వరి విస్తీర్ణం పెరిగింది. దిగుబడి కూడా 13,97,118 మెట్రిక్ టన్నులు ఉంటే.. ప్రస్తుతం 28,60,702 మెట్రిక్ టన్నులకు పెరిగింది. అంటే 14,63,584 మెట్రిక్ టన్నుల దిగుబడి పెరిగింది. ఇదంతా కాళేశ్వరం జలాలు రావడం, 24 గంటల కరెంట్ ఇవ్వడంతోనే ఇది సాధ్యమైంది. 2018కి ముందు అంటే.. రైతుబంధుకు ముందు 14,29,562 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే.. రైతుబంధు అమలు తర్వాత 22,41,066కు పెరిగింది. అంటే ఈ ఐదేళ్లలోనే 8,11,504 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది.

### విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు

స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్.. విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. రైతులకు నాణ్యమైన 24 గంటల కరెంటు ఇవ్వాలన్న సంకల్పంతో ముందుకు సాగారు. అందుకు అనుగుణంగా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయడంతోపాటు ఇతర సదుపాయాలు కల్పించారు. దీంతో వ్యవసాయరంగంలో వినియోగం భారీగా పెరిగింది. 2014లో ఉమ్మడి జిల్లాలో 1,120.36 మెగావాట్ల వినియోగం ఉంటే.. ప్రస్తుతం ఆ డిమాండ్ 3,328.85 మెగావాట్లకు చేరింది. అంటే గడిచిన తొమ్మిదేళ్లలో 2,234.83 మెగావాట్ల వినియోగం పెరిగింది. 2014లో ఉమ్మడి జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య 53,247 ఉంటే.. ప్రస్తుతం 78.958కు చేరింది. అంటే ప్రభుత్వం 25,711 ట్రాన్స్‌ఫార్మర్లు పెంచింది. 2014లో 3,39,298 కనెక్షన్లు ఉంటే.. అవి ప్రస్తుతం 4,18,505కు చేరాయి. గడిచిన తొమ్మిదేళ్లో 79,128 కనెక్షన్లు పెరిగాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సాగుకు దేశంలో ఎక్కడాలేని విధంగా 24 గంటల నాణ్యమైన కరెంటును ప్రభుత్వం అందిస్తున్నది.

### ఎవుసం మళ్లీ మొదటికి..?

ఒకవైపు సాగునీరు.. మరోవైపు 24 గంటల కరెంటు, రైతుబంధు వంటివి ఇచ్చి ఉత్పత్తులను అనూహ్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పెంచారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పదేళ్ల క్రితం లక్ష రూపాయలకు దొరికిన ఎకరం భూమి.. ఈ రోజు రూ.25 లక్షలకు తక్కువగా దొరకడం లేదు. దీంతో భూవివాదాలు పెరిగి భూములకు భద్రత లేకుండా పోతుందని భావించిన ముఖ్యమంత్రి.. రైతుల భూములకు సంపూర్ణ హక్కుతోపాటు రక్షణ కల్పించేందుకు ధరణి పోర్టల్‌ను అమల్లోకి తెచ్చారు. దీంతో రైతులు నిశ్చింతంగా ఉన్నారు. భూముల లావాదేవీలు కూడా పెరిగి, ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ భూములు కొంటున్నారు. అయితే, ఇప్పుడు తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని కాంగ్రెస్ చెబుతున్నది. నిజంగా ధరణి అనేది పక్కన పెడితే.. ముందుగా భూములకు రక్షణ లేకుండా పోతుంది. భూ వివాదాలు పెరుగుతాయి. ఫలితంగా ధరలు పడిపోయే ప్రమాదముంటుంది. పటేల్ పట్వారీ వ్యవస్థ తిరిగి వచ్చే ప్రమాదముంటుంది. అలాగే.. కాంగ్రెస్ నేతలు చెప్పినట్టు కౌలుదారు కాలం పెడితే భూ యజమానికి, కౌలుదారులకు మధ్య వివాదాలు తలెత్తడమే కాదు, భూ యజమానులు కౌలుకు ఇవ్వకుండా నిలిపివేసే ప్రమాదముంటుంది. క్రమంగా సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే ముప్పు ఉంటుంది. అలాగే, కరెంటుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్కొక్కరు ఒక్కో రకంగా మాట్లాడుతున్నరు. స్వయంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 24 గంటల కరెంటు రైతులకు అవసరం లేదని మూడు గంటలు ఇస్తే సరిపోతుందని ఇప్పటికే స్పష్టం చేశారు. ఇదే జరిగితే.. రైతులు మళ్లీ చాలీచాలని పాత కష్టాలే కొనితెచ్చుకున్నట్లు అవుతుంది. ఇంకా ఆ పార్టీ నాయకులు రైతుబంధు దుబారా అంటున్నారు. ఇప్పుడు ఏకంగా పెట్టుబడి సాయం పడకుండా చేశారు. ఒకవేళ వాళ్లకు ఓటేస్తే.. రైతు బంధును మొత్తానికే లేకుండా చేసే ప్రమాదమున్నది. ఇలా.. ఏ కోణంలో చూసినా రైతును జీవన్మరణ సమస్య నుంచి బయట పడేసిన 24 గంటల కరెంటు, ధరణి వంటి విషయంలో ఏమాత్రం పొరపాట్లు జరిగినా.. మళ్లీ ఎవుసం మొదటికే రావడంతోపాటు గ్రామీణ వ్యవస్థ అతలాకుతలమయ్యే ప్రమాదమున్నది. తద్వారా తాము ఆర్థికంగా దెబ్బతింటామన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది.

**పదకొండు విడుతల్లో ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా వచ్చిన రైతు బంధు లబ్ధిదారులు, రైతుల ఖాతాల్లో జమైన డబ్బుల వివరాలు**

| నియోజకవర్గం | లబ్ధిపొందుతున్న రైతుల సంఖ్య | 11విడుతల్లో వచ్చిన రైతు బంధు మొత్తం |
|---|---|---|
| చొప్పదండి | 85,859 | 719.61 కోట్లు |
| హుజూరాబాద్ | 73,667 | 584.41 కోట్లు |
| కరీంనగర్ | 21,634 | 138.34 కోట్లు |
| మానకొండూరు | 92,419 | 820.05 కోట్లు |
| జగిత్యాల | 58,069 | 442.74 కోట్లు |
| ధర్మపురి | 1,00,696 | 752.48 కోట్లు |
| కోరుట్ల | 58,959 | 521.79 కోట్లు |
| మంథని | 86,050 | 754.71 కోట్లు |
| పెద్దపల్లి | 90,743 | 731.74 కోట్లు |
| రామగుండం | 15,463 | 112.23 కోట్లు |
| సిరిసిల్ల | 67,516 | 562.64 కోట్లు |
| వేములవాడ | 74,587 | 695.00 కోట్లు |
| హుస్నాబాద్ | 99,681 | 914.94 కోట్లు |
| మొత్తం | 9.25,343 | 7,750.68 |



### కౌలు చట్టంతో పట్టాదారులకు ఇబ్బందులే

రైతులకు కాంగ్రెస్ ఎప్పుడూ ఏమీ ఇయ్యలే. ఎవుసం సక్కగా నడువాలంటే కరెంటు సక్కగా ఉండాలి. మూడు గంటల కరంటిస్తే ఎట్ల సరిపోతది. కాంగ్రెసోళ్లకు ఏమన్నా తెలివి ఉండే మాట్లాడుతున్రా. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి అందరికీ ఉపయోగకరంగా ఉంది. ధరణి పోర్టల్ వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలు రైతుల చట్టం తీసుకొస్తమని చెబుతుంది. దీంతో పట్టాదారులు ఆందోళన చెందుతున్నరు. కౌలు రైతు చట్టం తీసుకువస్తే భూపట్టాదారులకు ఇబ్బందులు తప్పవు. కౌలు రైతుల ఒప్పందాలతో భూ యజమానులకు తర్వాత ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఎన్నో ఏళ్ల నుంచి చాలా మంది రైతులు కౌలు తీసుకుని పంటలు పండించిన్రు. కానీ ఎప్పుడు కూడా ఒప్పందాలు రాసుకుని కౌలు చేయలేదు. కౌలుదారుల కాలమ్‌తో రోజూ పంచాయితీలే అయితయి. కౌలు రైతు చట్టాన్ని రైతులు ఎవరు అంగీకరించరు. అలాంటి చట్టం తెస్తన్నంటున్న కాంగ్రెస్ మాకద్దు. మేం మళ్ల బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం.

**- శ్రీరాముల రాజిరెడ్డి, రైతు, ఇటిక్యాల (రాయికల్)**



### కాంగ్రెసోళ్లను నమ్మితే ఎవుసం ఆగమే

మా గ్రామంలో పదేండ్ల కింద ఎకరానికి రూ. 2 లక్షలు విలువ ఉండేది. కానీ ప్రస్తుతం కాళేశ్వరం జలాలతో గ్రౌండ్‌వాటర్ పెరిగి, ఇప్పుడు ఎకరానికి రూ. 20 లక్షలు అయ్యింది. ఒకప్పుడు నీళ్లు లేక భూములన్నీ బీడుగా ఉండేటివి. అలాంటిది భూమి గుంట కూడా ఖాళీగా లేకుండా పంటలు సాగుచేస్తున్నం. మళ్ల కాంగ్రెసోళ్లు మూడు గంటలే కరెంట్ అంటున్రు. నీటి కొరత వచ్చి సాగు బంద్ పడుతది. ధరణి తీసేస్తమంటున్రు. అట్లయితే భూముల విలువ పడిపోతది. నీరు, కరెంట్ లేక పంటలు సాగు కావు. మళ్లీ రైతాంగం మొత్తం గల్ఫ్ బాట పట్టాల్సిన అవసరం వస్తది. ధరణి తీసేస్తే ఊళ్లల్లో భూముల పంచాయితీలు మొదలయితయ్. మళ్ల అసొంటి రోజులు రావద్దు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ మనం కరాబు చేసుకోవద్దు. అందుకే మళ్ల కేసీఆర్ సారే గెలువాలి. ఆయనొస్తేనే రైతులకు మంచి జరుగుతది.

**- రిక్కల సంజీవ్‌రెడ్డి, రైతు (కథలాపూర్)**

### ధరణిని తీస్తే దళారులు రాజ్యమేలుతారు



ధరణిని తీసేసి రేవంత్‌రెడ్డి బంగాళాఖాతంలో వేస్తామంటుండు. ధరణిని తీస్తే దళారులు రాజ్యమేలు తరు. కౌలుదారు చట్టం తెస్తమం టుండు. రైతుబంధు ఎవరికన్నా ఒక రికే ఇస్త మంటుండు. ఇట్లయితే భూ యజమాని, కౌలురైతు పైసలు కోసం కొట్టుకోవల్నా. కాంగ్రెసోళ్లు మా మధ్యల పంచాయితీ పెడుదామని చూస్తున్రు. మూడు గంటల కరెంటుతోని సాగు నడుత్తదా.. ? టెన్ హెచ్‌పీ మోటర్లు నడిపిచ్చుడు మనతోటి అవుతదా..? రేవంత్‌రెడ్డికి తెలివుండే మాట్లాడుతుండా..? ఈ కాంగ్రెసోళ్లకు రైతులను ముంచుడు తప్పా రైతులకు చేసేదేమీ ఉండదు. రైతులంటే వాళ్లకు కండ్లమంట. ఆగం చేయాలని చూస్తుండు. కాంగ్రెసోళ్లను నమ్మేదే లేదు. వాళ్లొస్తే మళ్లా పట్వారీ వ్యవస్థ వస్తది. దళారుల దగ్గరికి వెళ్లి పైసలిత్తే కానీ పని కాదు. మాకు కేసీఆర్ సర్ వచ్చి నంక ఎవుసం మంచిగా చేసిండు. ధరణితోనే రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు తొందరగా అయితున్నయి. రైతుబంధు మంచిగా వస్తుంది. మాకు మళ్ల కేసీఆర్ సార్ రావాలి. మేము బీఆర్ఎస్‌కే ఓటేస్తం.

**-మారుపాక రమేశ్, రైతు, ఇబ్రహీంపట్నం**

### కౌలుదారు చట్టంతో మళ్ల కష్టాలే



భూమాత పోర్టల్‌ను తీసుకొచ్చి కౌలుదారు కాలమ్ పెడుతమంటున్రు. దీంతో భూ యజమాని భూమిపై ఉన్న హక్కులు కోల్పోవలిసి వస్తది. మల్ల ఊళ్లల్లో పంచాయితీలు షురూ అయితయి. ధరణితో రైతులకు ఎంతో లాభం అయింది. మన భూమిని మన వారసులకు కాని, అమ్మినా 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ అయిపోతుంది. ఇప్పుడు భూమిని అమ్మిన, కొన్న తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్తే సరిపోతుంది. మన భూమి రిజిస్ట్రేషన్ అయిపోతుంది. సాక్షులు లేకున్నా మన పని అయితుంది. గతంలో ఇవన్నీ లేకుండే. పట్వారీ వద్దకు వారం రోజులు తిరిగితే కాగితాలు ఇస్తుండే. వాటిని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయం చుట్టు వారం తిరిగితే అప్పుడూ పని అయితుండే. ఇప్పుడు మళ్ల కాంగ్రెస్ పట్వారీ వ్యవస్థను తీసుకొస్తమంటున్రు. ధరణి వల్ల సామాన్యులకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. అట్లనే మళ్ల బీఆర్ఎస్సే రావాలి. కేసీఆర్ సారే సీఎం కావాలి.

**- కొంగరి శోభన్ రెడ్డి, రైతు, గుల్లపేట (జగిత్యాల)**

### గతంలో పొద్దుందాక పొలం వద్దనే ఉండేటోళ్లం



తెలంగాణ వచ్చినాంక 24 గంటల కరెంటుతో ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు పొలం వద్దకు పోయి కరెంటు మోటర్ పెట్టుకుని వస్తున్నం. 3 గంటల కరెంట్ వస్తే ఏ మూలకు చాలాది. గతంలో మాదిరిగానే మళ్లీ పొలం వద్దకు దుప్పటి, టార్చిలైటుతో పడిగాపులు కాసే కాలం వస్తుంది. అలాంటి కాంగ్రెస్ కరెంటు ఇత్తదంటే మళ్ల నమ్ముతమా..? 24 గంటల కరెంటు ఉంటేనే రైతు ప్రశాంతంగా ఉండి, కుటుంబంతో కాస్తా నిద్ర పోవచ్చు. అందకే ఎవుసాన్ని పండుగలా చేసిన కేసీఆర్ సారును మళ్ల గెలిపించుకుంటం.

**- కొంగరి కళావతి, మహిళా రైతు, గుల్లపేట(జగిత్యాల మండలం)**